

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

ఆదివారం

30 నవంబర్ 2025



Follow :





- తన గ్రామ యువతను పెద్ద ఆఫీసర్లు చేయడమే లక్ష్యం
- గ్రామంలో విద్య, ఉద్యోగ అవకాశాలు ఏర్పాటుకు కృషి
- మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తా

## నంది వనపర్తి గ్రామాన్ని ఉన్నత విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతా..!

### గ్రామాన్ని ఐపిఎస్‌ల ఫ్యాక్టరీగా మారుస్తా...

### 100 మంది గ్రూప్-1, గ్రూప్-2 ఆఫీసర్లు తయారీకి భరోసా

### ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీకి సిద్ధం గోరటి వెంకటేశం

**యాచారం, నవంబర్ 29(జనం సాక్షి) :** నంది వనపర్తి గ్రామంలో ఉన్నత విద్యా, ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించడమే లక్ష్యంగా పనిచేస్తానని గోరటి వెంకటేశం అన్నారు. నందివనపర్తి గ్రామానికి చెందిన గోరటి వెంకటేశం మాట్లాడుతూ... సర్పంచ్ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నంది వనపర్తి సర్పంచ్ గా పోటీ చేస్తున్నానని తెలిపారు. నంది వనపర్తి ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. నంది వనపర్తి లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రూప్ - 1,గ్రూప్-2, సివిల్స్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి, అర్హత ఉన్న విద్యార్థులకు ఆఫీసర్లు అవ్వడానికి అన్ని ఏర్పాట్లు, వసతులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. తన గ్రామంలో కనీసం 100 మందికి పైగా గ్రూప్-1, గ్రూప్ -2 ఆఫీసర్లుగా తీర్చిదిద్దడం కోసం భగీరథ ప్రయత్నం చేస్తానని తెలిపారు. తన గ్రామీణ యువత ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందడం తన లక్ష్యంగా పేర్కొన్నారు. తన గ్రామ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులో తీసుకువస్తానని, గ్రామంలోనే అందుకు కావాల్సిన శిక్షణ నిర్వహణ ఏర్పాటు చేస్తానని తెలిపారు. కుట్టు మిషన్, వస్త్రాలు, చేతిపనులు, మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్ ఇలా మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శింపచేసే శిక్షణ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రాథమిక విద్యార్థులకు సాయంత్రం వేళ రోజు ట్యూషన్ విధానం తీసుకొచ్చి, అందుకోసం ప్రత్యేక భవన నిర్మాణం, ట్యూషన్ కావాల్సిన చదువు మెటీరియల్, చదువు చెప్పేందుకు వాలంటీర్ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం, ఉద్యోగం సాధించే మార్గాలు చూపుతానని, వారి కోసం ప్రత్యేకమైన నైపుణ్య శిక్షణలు అందిస్తానని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక కంప్యూటర్ విద్య శిక్షణ కోసం గ్రామంలోని ప్రతి కమ్యూనిటీ హాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి నిపుణులచే శిక్షణ ఇప్పిస్తానన్నారు. హామీ ఇచ్చిన అన్ని వాగ్దానాలు నెరవేర్చి చూపిస్తానని, సర్పంచ్ అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని, గ్రామీణ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడతానని గోరటి వెంకటేశం పేర్కొన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా సర్పంచ్‌కు నిల్చుంటున్న తనను నందిగాన పర్తి ప్రజలు ఆశీస్సులు అందించి, మనసారా దీవించాలని కోరారు.

## కేసీఆర్ ఆమరణ దీక్షకు 16 ఏండ్లు

### పీర్జాదిగూడలో ఘనంగా దీక్ష దీవాస్

- పాల్గొన్న మల్లారెడ్డి,జక్క వెంకట్ రెడ్డి
- బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు పైళ్ల ప్రభాకర్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర సాధన దశ,దిశను మార్చిన అపురూప ఘట్టమే దీక్షా దివస్.పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన దీక్షా దీవాస్ కార్యక్రమానికి మాజీ మంత్రి,మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి,నగర మాజి మేయర్ జక్క వెంకట్ రెడ్డి,యూత్ అధ్యక్షుడు పైళ్ల ప్రభాకర్ రెడ్డి హాజరై తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటించి అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం కోసం కేసీఆర్ ఇదే రోజు 2009 నవంబర్ 29న తాను సచ్చైనా తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తానని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని తన చావును సైతం లెక్కచేయకుండా నీళ్లు,నిధులు, నియామకల కోసం తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడం కోసం ఆంధ్ర వలస వాదులపై అప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై విరామం ఎరగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహా యోధుడుగా పేరు పొందారన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రదాన కార్యదర్శి ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజి కార్పొరేటర్లు,యూత్ నాయకులు ప్రవీణ్ రెడ్డి,సతీష్ గౌడ్,రాజశేఖర్ రెడ్డి,రఘు,షాహిద్,రవికుమార్ భీమ్రావు,సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం

- ఏకగ్రీవం అయినా గ్రామ పంచాయతీల అభివృద్ధికై రూ.10 నుండి20 లక్షలు.
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.



➤లోపలి పేజిలో

## ఎన్నికల కోడ్ నిబంధనలో పాటించాలి

### నవాబుపేట్ ఎస్సై పుండ్లిక్..!!



**నవాబుపేట్ నవంబర్, 29(జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలని నవాబ్ పేట్ ఎస్సై జీ.పుండ్లిక్ అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన లో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మండలంలో 163బీఎన్ఎస్ఎస్ (144)సెక్షన్ అమల్లో ఉంటుందని సభలు, సమావేశాలు,ర్యాలీలకు అనుమతి లేదన్నారు. నాయకులు, ప్రజలు,వాహనదారులు నిబంధనలు పాటిం చాలని చెప్పారు.ఎవరైనా గొడవలు సృష్టించిన, సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.అలాగే లావాదేవీల వివరాలు లేకుండా అధిక మొత్తంలో నగదును తరలిస్తే సీజ్ చేస్తామని,వ్యక్తిగతంగా రూ. 50 వేలకు మించి వాహనాల్లో తీసుకెళ్లినా స్వాధీనం చేసుకుంటా మని పేర్కొన్నారు.ఎన్నికల కోడ్ డిసెంబర్ 17వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.మండల ప్రజలు ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని పేర్కొన్నారు.



➤లోపలి పేజిలో

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం

- మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు గెలవబోతున్నారు : మాజీ ఎమ్మెల్యే పైలెట్

# సిద్ధిస్ స్కూల్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గర్వకారణం

### ఎకో ఇన్నోవేషన్స్‌లో మొదటి బహుమతి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అంతర్జాతీయ పాఠశాలల మధ్య నిర్వహించిన ఎకో ఇన్నోవేషన్స్ పోటీలో సిద్ధిస్ స్కూల్ జూనియర్ బృందం మొదటి బహుమతిని గెలుచుకుంది. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సృజనాత్మక ప్రాజెక్ట్ నమూనాలు మరియు అవగాహన కార్యక్రమాలు జడ్జీలను ఆకట్టుకుని ఈ అగ్రస్థానాన్ని సాధించాయి. ఈ విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల డైరెక్టర్ శ్రీ సత్య సర్ విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడుతూ.. "మా సిద్ధిస్ స్కూల్‌లో ఇప్పటికే రోబోటిక్స్, అంతర్జాతీయ ప్రమాణాల బోధన కల్పిస్తున్నాము. ప్రపంచ స్థాయి పాఠశాలలతో పోటీ పడేలా మా విద్యార్థులను అభివృద్ధి చేసి, మరిన్ని అంతర్జాతీయ విజయాలను సాధించేందుకు దారితీస్తాము," అన్నారు. సాంకేతికత, పర్యావరణ అవగాహన, మరియు గ్లోబల్ ప్రమాణాల విద్యను సమన్వయం చేస్తూ సిద్ధిస్ స్కూల్ ముందుకు తీసుకువెళ్తున్న విద్యా విధానం ఇప్పుడు ఫలితాలు ఇస్తోంది. ఈ గొప్ప విజయాన్ని సాధించిన విద్యార్థులందరికీ, ఉపాధ్యాయులకు, మరియు తల్లిదండ్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. సిద్ధిస్ స్కూల్ మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాము.

# ప్రివెంటివ్ హెల్త్‌పై విజయవంతమైన సీపీడీ ప్రోగ్రామ్



**హైదరాబాద్, నవంబర్ 29 (జనంసాక్షి) :** అసోసియేషన్ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ (ఏఓహెచ్) – ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్‌తో కలిసి హైదరాబాద్‌లోని అంకురా హాస్పిటల్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్, నవంబర్ 23, 2025న బంజారా హిల్స్‌లోని మెర్క్యూర్ హైదరాబాద్ కేసీపీలో "గర్భం నుండి పనిప్రదేశానికి : నివారణ ఆరోగ్య సంస్కృతిని నిర్మించడం" అనే కార్పొరేట్ నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి (సీపీడీ) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం జీవిత దశలలో, తల్లి, పిల్లల ఆరోగ్యం నుండి కార్యాలయ భద్రత మరియు ఉద్యోగుల ఆరోగ్యం వరకు నివారణ ఆరోగ్య సంరక్షణ యొక్క కీలక పాత్రను నొక్కి చెప్పింది మరియు అంకురా హాస్పిటల్స్ నుండి ప్రముఖ వృత్తిపరమైన ఆరోగ్య నిపుణులను మరియు ప్రముఖ వృత్తిపరమైన ఆరోగ్య నిపుణులను ఆహ్వానించింది. తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్టరీల డైరెక్టర్ శ్రీ వై. మోహన్ బాబు ముఖ్య అతిథిగా ఈ చొరవను ప్రశంసిస్తూ, "నివారణ ఆరోగ్య సంరక్షణను జీవితంలోని ప్రతి దశలోనూ మరియు ప్రతి పనిప్రదేశంలోనూ పొందుపరచాలి. ఈ సీపీడీ కార్యక్రమం వంటి ప్రయత్నాలు అవగాహనను పెంపొందించడంలో మరియు శ్రామిక శక్తికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాలను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి."

ప్రత్యేక అతిథులుగా ఎన్ ఎఫ్ సీ, ఐఏఓహెచ్ జాతీయ వైద్య విభాగం మాజీ అధిపతి డాక్టర్ జె. విజయ్ రావుబీ హైదరాబాద్ బిర్లాను, హెచ్‌ఎస్‌ఈ అధిపతి డాక్టర్ ఎస్.పి. వివేక్ చంద్రరావు, అంకురా హాస్పిటల్స్‌లోని క్లస్టర్ మెడికల్ డైరెక్టర్ (సీఎండీ), పిల్లల వైద్యుడు డాక్టర్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. ఏఓహెచ్–ఏపీ బ్రాంచ్ లీడర్‌షిప్ – ప్రెసిడెంట్ డాక్టర్ పి. ఆర్. నంద కిషోర్ మరియు కార్యదర్శి డాక్టర్ సుధా బాలా ప్రారంభ వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ నంద కిషోర్ ఇలా అన్నారు: "ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు మరియు వృత్తిపరమైన ఆరోగ్య సంస్థల మధ్య బలమైన సహకారం ఈ కాలపు అవసరం. ఇలాంటి కార్యక్రమాలు పరిశ్రమ, క్లినికల్ నైపుణ్యం మరియు ప్రజారోగ్య ప్రాధాన్యతలను సమలేఖనం చేయడంలో సహాయపడతాయి." డాక్టర్ సుధా బాలా ఇలా అన్నారు: "నిరంతర అభ్యాసానికి సీపీడీ వేదిక చాలా ముఖ్యమైనది. కార్పొరేట్ వ్యవస్థలలో నివారణ ఆరోగ్యాన్ని సమగ్రపరచడం ఉద్యోగుల శ్రేయస్సును కాపాడటానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి." ఈ కార్యక్రమంలో ప్రముఖ పరిశ్రమల నుండి చీఫ్ మెడికల్ ఆఫీసర్లు మరియు సీనియర్ వైద్య నిపుణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హాజరైనవారు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ద్వారా గుర్తింపు పొందిన 1 సీపీడీ క్రెడిట్ పాయింట్‌ను పొందారు. అంకురా హాస్పిటల్స్ గ్రూప్ హెడ్, విపి – మార్కెటింగ్, శ్రీ అజయ్ రావత్, కార్పొరేట్‌లకు నివారణ ఆరోగ్య సంరక్షణను ముందుకు తీసుకెళ్లడానికి మరియు సమగ్ర ఉద్యోగి మరియు కుటుంబ శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఆసుపత్రి అంకితభావాన్ని నొక్కి చెప్పారు. ప్రభావవంతమైన సహకార మైలురాయిని జరుపుకుంటూ, ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది.

# యాదవులకు జనాభాపరంగా హక్కులు కల్పించాలి

### నవీన్ యాదవ్ సన్మాన సభలో పాల్గొన్నమల్లిబాబు యాదవ్, చిత్తారు సింహాద్రి

**ఖమ్మం (జనంసాక్షి) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 18% ఉన్న యాదవులకు జనాభా నిష్పత్తిలో హక్కులు కల్పించాలని ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలో తొలి ఏకైక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా శనివారం నాడు హైదరాబాదులో రాష్ట్ర అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నవీన్ యాదవ్ కు సన్మాన కార్యక్రమం శుభం కన్వెన్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర యువజన అధ్యక్షులు గొర్ల యశ్వంత్ యాదవ్, రాష్ట్రగొర్రెల పెంపకం దారుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ కన్నెబోయిన రాజయ్య తదితర యాదవ సంఘాల నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నుండి మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో దాదాపు 50 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సన్మానం కార్యక్రమంలో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికైనా చట్టసభలో మన యాదవుల సమస్యల్ని ప్రస్తావించడానికి శాసనసభ్యునిగా అడుగుపెడుతున్న నవీన్ యాదవ్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. యాదవులకు జనాభాపరంగా చట్టసభలలో ప్రాతినిధ్యం లేకుండా పోయిందని, తక్కువ జనాభా కలిగిన



వారు ఐకమత్యంతో పదవులు సాధిస్తున్నారని, తరతరాలుగా యాదవులపై భౌతికంగా మానసికంగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాదవులంతా ఏకత్రాటిపైకి వచ్చి సమస్యల్ని పరిష్కరించుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. యాదవులు పశువులు గొర్రెలు వృత్తిని ఆధారంగా చేసుకుని అడవులలో జీవాలు మేపుకుంటూ కొండలు గుట్టలు ఎక్కి దిగుతూ, విష సర్పాలు వన్యప్రాణులు దాడులతో ఎంతోమంది చనిపోతున్నారని, 50 సంవత్సరాలకే మోకాళ్ళ నొప్పులతో కదలలేని పరిస్థితిలో అనారోగ్యంతో ఉంటున్నారని, ఇలాంటి దుర్భర జీవితం గడుపుతున్న యాదవులకు రాజ్యాంగంలో స్థానం లేకుండా గతంలో మనకు ఉన్న ఎస్ ఎన్ టి సర్టిఫికెట్ ను రద్దుచేసి బిసి డి లో చేర్చడం చాలా అన్యాయమని, బీసీ ఏ లో చేర్చాలని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 559 1016 జీవోలను ప్రభుత్వం అమలు చేయాలని, ప్రమాదవశాత్తు మరణించిన ప్రతి గొర్రెల కాపరికి బీసీ సోదరులు గీత కార్మికులు చేనేత కార్మికులు, మత్స్య కార్మికుల్లాగా నష్టపరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సన్మాన గ్రహీత నవీన్ యాదవ్ యాదవుల సమస్యల్ని చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కరిస్తానని, రాజకీయాలు వర్గాలకతీతంగా యాదవులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నుండి కోదాడ శ్రీనివాస్ యాదవ్, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, రేఖ మురళి మారుతి ఎట్టయ్య పుట్టా ఉపేందర్, పల్లెబోయిన శ్రీనివాస్ వర్ధబోయిన నరసింహారావు, మొరి మేకల నాగేశ్వరరావు, తోడేటి లింగరాజు బరిగల రామ్మూర్తి అంగడాల అనిల్, సంగం బిక్షపతి యాదవ్ వాకదాని కోటేశ్వరరావు, మేకల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్‌ను కలిసిన సోషల్ జస్టిస్ ప్రతినిధి బృందం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ గవర్నర్‌ను శియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. శియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధి బృందం రాజ్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా శియా సామాజిక వర్గానికి సముచిత ప్రతినిధిత్వం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్టికల్ 171(5) ప్రకారం (గవర్నర్ కోటా) ఎంఎల్‌సీ నామినేషన్ కోసం వినతిపత్రం సమర్పించారు. హిదాయత్ అలీ మిర్జా – డైరెక్టర్, నేషనల్ ప్రెసిడెంట్, షబ్బీర్ అలీ మిర్జా – డైరెక్టర్, ఛైర్మన్, సయ్యద్ ఆబిద్ హుస్సైన్ – డైరెక్టర్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్, సయ్యద్ షకీల్ హైదర్ – డైరెక్టర్ సీఈఓ, సయ్యద్ హైదర్ రజా నక్వీ – నేషనల్ కన్వీనర్, మొహమ్మద్ అలీ హైదర్ – డైరెక్టర్, నేషనల్ జనరల్ సెక్రటరీ, మొహమ్మద్ సాదిక్ హుస్సైన్ ప్రతినిధి బృందం తమ వినతిని ఓర్పుగా విని స్పందించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




# శంషాబాద్ క్లస్టర్-2లో నామినేషన్ల రద్దీ

**రాజేంద్రనగర్, నవంబర్ 29 (జనం సాక్షి) :** శంషాబాద్ మండల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లు మూడో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. క్లస్టర్-2లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు వరుసగా రాకపోకలతో కార్యాలయం రద్దీగా మారింది. నర్కుడ గ్రామంలో కాంగ్రెస్ తరఫున సర్పంచ్ అభ్యర్థి గడ్డం శేఖర్ యాదవ్ దంపతులు, మాజీ జెడ్పీటీసీ చైర్మన్ తన్వీ రాజు ముదిరాజ్ సమక్షంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అదే గ్రామంలో 11వ వార్డు సభ్యుడిగా దన్నాడ (డి.జె) మహేష్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. బిజెపి తరఫున నాన్నవాళ్ళ కుమార్ యాదవ్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేశారు. మాజీ సర్పంచ్ సునిగంటి సిద్దులు, రాష్ట్ర బీజేపీ నాయకులు బుక్కా వేణుగోపాల్ ఆయనకు మద్దతుగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ తరఫున బుర్గుంట స్వాతి సతీష్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కవ్వగూడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కుక్కల ఇంద్రమ్మ ఈశ్వరయ్య , చౌదరిగూడ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా కొమ్ము మనీషా కూడా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్లతో క్లస్టర్-2 పరిధి ఎన్నికల రంగం సందడి వాతావరణాన్ని సంతరించుకుంది.




## దక్షిణ భారత విద్యా పర్యటనలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

**రాజేంద్రనగర్,నవంబర్ 29(జనం సాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ మూడో ఏడాది 130 మంది విద్యార్థులు ఈ నెల 21 నుంచి దక్షిణ భారత విద్యా పర్యటనను కొనసాగిస్తున్నారు.అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్ ఈ యాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా కర్ణాటక బెంగుళూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయం, జాతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ, మైసూరులోని జాతీయ ఆహార శాస్త్ర పరిశోధనా కేంద్రాన్ని విద్యార్థులు సందర్శించారు. ఊటీలో జాతీయ బంగాళా దుంప పరిశోధన సంస్థలో నూతన వంగడాలపై శాస్త్రవేత్తలతో అవగాహన పెంపొందించుకున్నారు. తమిళనాడు కోయంబత్తూరు లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కీటక శాస్త్ర మ్యూజియం, డ్రోన్స్ విభాగాన్ని, కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి మ్యూజియం, ఇన్స్ట్రుమెంటేషన్ సెంటర్, సుగంధ ద్రవ్యాల నర్సరీలను



పరిశీలించారు. ఎర్నాకులం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, త్రివేంద్రం లోని పలు వ్యవసాయ పరిశోధనా సంస్థలను కూడా సందర్శించారు. ఈ యాత్రకు డాక్టర్ అనురాధ, డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రమేష్ గైడ్‌లుగా వ్యవహరిస్తున్నారు. యాత్ర డిసెంబర్ 2తో ముగియనుంది. విద్యార్థులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరిశోధనలు, సాంకేతికతలపై విస్తృత అవగాహన పొందుతున్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన కాసింబౌళి గ్రామం



**మొయినాబాద్ జనంసాక్షి :** స్వామి శరణం అయ్యప్ప శరణం నామస్మరణతో కాశీంపల్లి గ్రామంలో మారుమరగింది కాసింబోలి గ్రామానికి చెందిన మాడి పెంటారెడ్డి కుమారుడు రాజేందర్ రెడ్డి గురుస్వామి 18వ మహా పడిపూజ గ్రామంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అయ్యప్ప మా పడిపూజను విజయ్ కుమార్ గురుస్వామి ఉమామహేశంకర్ రెడ్డి గురు స్వాములు కలిసి అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని వాడవాడల అయ్యప్ప నామస్మరణం అయింది 18వ అయ్యప్ప మహా పడిపూజ కావడంతో తెలంగాణ రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సాములు వివిధ రాజకీయ నాయకులు మాజీ మంత్రులు తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు దీంతో కాసింబాల గ్రామంలో అయ్యప్ప నామస్మరణం మార్మ్ర రాగింది అన్నదాన ప్రభువుగా మాడి స్వరూప పెంటారెడ్డి కుటుంబ సభ్యులు కాగా వారి కుటుంబ సభ్యులు మోహన్ రెడ్డి వెంకట్ రెడ్డి రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులందరు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు దీంతో ఖాసింభవిలో అయ్యప్ప 18 వ మహా పడిపూజ కార్యక్రమం కనుల పండుగ జరిగింది వేలాది మంది భక్తులు పాల్గొనడంతో కాసింహౌలా అయ్యప్ప నామస్మరణతో మారం అయింది.

## దీక్షా దివస్ కార్యక్రమానికి బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు

**మల్కాజిగిరి నవంబర్ 29 జనం సాక్షి** తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో నాడు దీక్ష దివాస్ కార్యక్రమాన్ని చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్ష దివాస్ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు దీక్ష దివాస్ ను పురస్కరించుకొని మేడ్చల్ లో గల పార్టీ కార్యాలయంలో శనివారం చేపట్టిన కార్యక్రమానికి గౌతమ్ నగర్ డివిజన్ నుండి కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీతో జై తెలంగాణ నినాధాలతో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.



## వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

**రాజేంద్రనగర్,నవంబర్29(జనంసాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ క్వార్టర్స్ బతుకమ్మ పార్క్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మునునాయుడు గురుస్వామి, రాజేంద్ర గౌడ్ గురుస్వామి, మల్లేష్ గురుస్వామి, జ్ఞానేశ్వర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం 18వసారి అయ్యప్పమాల ధరించిన పి. శివకృష్ణారెడ్డి గురుస్వామి అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు.

## పంచాయతీ ఎన్నికల్లో..భోణి కొట్టిన ‘లక్ష్మీనారాయణపూర్’

- సర్పంచ్ వార్డు మెంబర్లు ఏకగ్రీవం
- సర్పంచ్ గా గుర్రాల నాగమణి నర్సిరెడ్డి
- ఇక వీరి ఎన్నిక లాంచనమే.



**తాండూరు నవంబర్ 29(జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా యాలాల మండలం లక్ష్మీనారాయణ పుర్ తాండూరు నియోజకవర్గం లోనే బోణీ కొట్టింది. సర్పంచ్‌తో సహా వార్డు మెంబర్ల స్థానాలకు గాను ఒక్కటే నామినేషన్లు దాఖలు కావడంతో ఇక వారి ఎన్నిక ఇక లాంచనప్రాయమే. సర్పంచ్ అభ్యర్థిగా గుర్రాల నాగమణి నర్సిరెడ్డి ని గ్రామస్తులంతా కలిసి పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. అదేవిధంగా వార్డు సభ్యులకు కూడా 8 మందిని ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. దీంతో వీరందరి ఎన్నిక లాంచన ప్రాయం కానుంది. నామినేషన్ల చివరి రోజు అయిన నేడు సర్పంచ్ అభ్యర్థిగా గుర్రాల నాగమణి నర్సిరెడ్డి తోపాటు 8 మంది వార్డు సభ్యులకు గాను అగ్గనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి గుర్రాల నాగమణి నర్సిరెడ్డి మాట్లాడుతూ తనతోపాటు 8 మంది వార్డు సభ్యుల అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన గ్రామస్తులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ వి రెడ్డి, సురేందర్ రెడ్డి, నాగమొల్ల, నర్సిరెడ్డి,శేఖర్ రెడ్డి, గుర్రాల నర్సిరెడ్డి, జైపాల్ రెడ్డి, నాగమొల్ల సురేందర్ రెడ్డి, కుర్వ అంజిలయ్య ,నర్సింలు,జగదీష్, మహేష్ కాశప్ప,శ్రీనివాస్, రమేష్, నగేష్,దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### పంచాయితీ పోరుకు 32 పంచాయితీలను11 క్లస్టర్ గా విభజన



**తలకొండపల్లి నవంబర్ 29 (జనంసాక్షి):** తలకొండపల్లి మండలంలో నేటి నుంచి 32 గ్రామపంచాయతీలలో సర్పంచ్,వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తామని తలకొండపల్లి ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు.పంచాయతీ పోరులో నామినేషన్ల స్వీకరణకు 32 పంచాయితీలను11 క్లస్టర్లుగా విభజించారు. కేటాయించిన క్లస్టర్ గ్రామాల్లోనే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాలన్నారు. 1.పడకల్ గ్రామంలో పడకల్, లింగరావుపల్లి, 2.దేవుని పడకల్ గ్రామంలో దేవుని పడకల్, పెద్దూరుతండా,వెంకటాపూర్ తండా, 3.వెల్జాల్ గ్రామంలో వెల్జాల్,చౌదర్ పల్లి,మాదాయ పల్లి,4.జూలపల్లి గ్రామంలో జూలపల్లి,వెంకటాపూర్,అంతారం,5.చంద్రదన గ్రామంలో చంద్రదన,రాంపూర్,మెదక్ పల్లి,6.గట్టు ఇప్పలపల్లి గ్రామంలో గట్టు ఇప్పలపల్లి, వీరన్నపల్లి, కోరింతకుంట తండా,7.ఖానాపూర్ గ్రామంలో ఖానాపూర్, జంగారెడ్డిపల్లి, గౌరీ పల్లి, 8.వెంకట్రావుపేట గ్రామంలో వెంకట్రావుపేట, బల్సులపల్లి తండా, గడ్డమీది తండా,9.తలకొండపల్లి గ్రామంలో తలకొండపల్లి, హర్యా నాయక్ తండా,పుల్ సింగ్ తండా,10.చుక్కాపూర్ గ్రామంలో చుక్కాపూర్,చెన్నారం,పాతకోట తండా,11.చీపునుంతల గ్రామంలో చీపునుంతల,తుమ్మలకుంట తండా,పడమటి తండా,అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాలని ఎంపీడీవో తెలిపారు.

# బీఆర్ఎస్ దీక్ష దివాస్ ప్రస్తావన మరిచిపోవాలి

## తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి స్పోర్ట్ పర్సన్ గౌరీ సతీష్



**మొయినాబాద్ నవంబర్29 జనం సాక్షి :** బీఆర్ఎస్ పార్టీ దీక్ష దివాస్ అనే పేరును పూర్తిగా మర్చిపోవాలని తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి స్పోర్ట్స్ గౌరి సతీష్ పేర్కొన్నారు. శనివారము ఆయన మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లిలో సందర్శిం చిన సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉనికి కోసమే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఉనికి కోసమే దీక్ష దివాస్ తెలంగాణ రాష్ట్ర సాధనలో బిల్లు పాస్ అయిన సందర్భంగా ఆరోజు దీక్ష చేస్తున్నప్పుడు తెలంగాణ రాష్ట్ర నడిబొడ్డులో ఉస్మానియా యూనివర్సిటీలో ఏం జరిగిందో గతం మర్చిపోయి ఈరోజు దీక్షా దివాస్ పేరుతోటి తెలంగాణ ప్రజలను మరొక్కసారి మోసపూరితమైనటువంటి మాటలు గుర్తు చేయడానికి ప్రయత్నం చేస్తున్నటువంటి బీఆర్ఎస్ పార్టీ మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అయితే తెలంగాణ రాష్ట్ర సమితి పేరు నుంచి భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుందో అప్పుడే తెలంగాణ రాష్ట్రం తోటి పేగు బంధం తెగిపోయిం దని సూచించారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎప్పుడైతే తెలంగాణ రాష్ట్ర ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో మీరు కనీసం ఎన్నికల్లో అయినటువంటి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కనీసం ఇవన్నీ మీరు ఆత్మ పరిశీలన చేసుకోకుండా మరొకసారి మీరు దీక్షా దివాస్ పేరుతోటి తెలంగాణ ప్రజలకు మభ్యపెట్టే విధంగా ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం చేసుకోవాలని సూచిస్తాం ఇకనైనా దీక్ష దివాస్ మరిచిపోయి దీక్షలు మానుకోవాలని గౌరీ సతీష్ ఇతవు పలికారు.

# దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం



**రాజేంద్రనగర్, నవంబర్ 29 (జనంసాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారులకు సన్మానం జరిగింది. 2009లో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కే.సీ.ఆర్ చేపట్టిన నిరాహార దీక్ష జ్ఞాపకార్థం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తదుపరి 1969 నుంచి తెలంగాణ ఉద్యమంలో పోరాడిన బట్ట బీరప్ప, ముత్తంగి లక్ష్మయ్య, సింగదాసరి ప్రకాశ్, గణేష్, శ్రీబాబు, రావకోలు శ్రీశైలం, చిన్న బీరప్ప, గుట్టమీదీ రమేష్, ఈదులకంటి మహేష్, జైరామ్, అందె లక్ష్మణ్ రావు తదితర ఉద్యమ కారులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుప్పాలగూడ ఎల్.ఐ.సి. కూడలి వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం స్థానిక నాయకులు కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షా దివస్ కార్యక్రమంలో అందె లక్ష్మణ్, అరీఫ్, బొడ్డు శ్రీధర్, సుమనలిని, బిందు, రేఖ, దేవి, జయరాజ్ యువరాజ్, శశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### దీక్ష దివాస్ కార్యక్రమానికి తరలి వెళ్లిన

# జగద్గిరిగుట్ట బిఆర్ఎస్ నాయకులు



**కుత్బుల్లాపూర్ నవంబర్ 29 ( జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన దీక్ష దివాస్ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీమంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, నంది కంటి శ్రీధర్‌లు ముఖ్య అతిథులు హాజరైన ఈ కార్యక్రమానికి జగద్గిరిగుట్ట డివిజన్ నుండి బిఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ అధ్యక్షతన పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జైహిందు మాట్లాడుతూ దీక్ష దివాస్ స్ఫూర్తితో బిఆర్ఎస్ కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పార్టీ గెలుపు కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాసేవకు పదవీ విరమణ ఉండదు


ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ నవంబర్ 29 (జనంసాక్షి) :** పదవీ విరమణ అనేది కేవలం వయసుకు మాత్ర మేనని ప్రజా సేవకు పదవీ విరమణ ఉండదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్ లో కుత్బుల్లా పూర్ సర్కిల్ పరిధిలో ట్యాక్స్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న నిండు శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి దంపతులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వివేకానంద మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలుగా వివిధ హోదాలలో ప్రభుత్వ ఉద్యోగిగా సేవలు అందించిన శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజే శారు. పదవీ విరమణ అనేది కేవలం వయసుకు మాత్రమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జంట సర్కిల్లో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ నిరాహార దీక్షతోనే తెలంగాణ కల సాకారమైంది

**ఓయూ (జనం సాక్షి):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిరాహార దీక్షతోనే తెలంగాణ కల సాకార మైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో దీక్షా దివాస్ పురస్కరించుకొని బి ఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం ఎన్సిసి గేట్ నుండి ఆర్ట్స్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.



# ఘనంగా 18వ అయ్యప్ప మహా పడిపూజ

**మొయినాబాద్ నవంబర్ 29 జనంసాక్షి :** స్వామి శరణం అయ్యప్ప శరణం శరణం శరణం అయ్యప్ప అంటూ హిమాయత్ నగర్ గ్రామంలో అయ్యప్ప సామి మహా పడిపూజ మార్మోగింది. శనివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామానికి గ్రామానికి చెందిన ముదిగొండ మహేందర్ యాదవ్ గురుస్వామి 18వ మహా పడిపూజ విజయ్ రాజ్ ఠాకూర్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ గుడిమల్కాపూర్ కు చెందిన కేశవ్ గురుస్వామి కారకములచే నిర్వహించారు. గురుస్వామి ..అయ్యప్ప మహా పడిపూజలో ముందుగా గణపతి హోమము గణపతి పూజ కుమారస్వామి పూజ నిర్వహించి. అయ్యప్ప స్వామికి పూలు పండ్లు నూతన వస్త్రాలు నైవేద్యం సమర్పించి మా మంగళహారతిని సమర్పించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పడిపూజలో అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు పాల్గొని అయ్యప్ప భక్తి పాటలతో భజనలు నిర్వహించారు. దీంతో గ్రామంలో అయ్యప్ప నామస్మరణంతో భక్తులు ఎంతో ఆనందంతో తిలకించారు. అనంతరం స్వామివారి దర్శనం భక్తులందరికీ తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదములు సమర్పించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ గ్రామంలో అయ్యప్ప భక్తుల సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో చిలుకూరు బాలాజి ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్, ఆదిత్య పరాశ్రీ స్వామీజీ, గణపతి గురుస్వామి, సన్నిధానం స్వాముల,గ్రామ పెద్దలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనారు.

# బీఆర్ఎస్ పాలనతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

**చేవెళ్ల, నవంబరు 29 (జనంసాక్షి)** రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని చేవెళ్ల నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ తెలి పారు. దీక్ష దివాస్ సందంర్భంగా శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు దీక్షా దివాస్ సందర్బంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2009 సంవత్సరంలో కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేయడంతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంతోనే తెలంగాణ సాధ్యమైందన్నారు. బిఆర్ఎస్ పాలనలోనే ప్రజలందరికి పథకాలు అందాయన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. చేతకాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ వ్యతిరేఖ పాలన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామగౌడ్, వై.కృష్ణ, అబ్దుల్ ఘని, సుదర్శన్, రాఘవేందర్ రెడ్డి, రాంప్రసాద్, మహేందర్ యాదవ్, కుమార్ గౌడ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# డాక్టర్ చింతల రాకేశ్ భవానికి భగవాన్ సత్య సాయిబాబా సేవా పురస్కారం



**హయత్ నగర్, నవంబర్ 29 (జనం సాక్షి) :** పుట్టపర్తి సత్యసాయిబాబా 100 వ జయంతి ఉత్సవమును పురస్కరించుకొని 2025 సంవత్సరానికి సాహిత్య, సామాజిక సేవా పథక విభాగాల్లో చేసిన కృషికి గాను “ సత్యసాయి సేవా పురస్కారం “ ను కవి, రచయిత, గాయకులు, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవాని కి నిర్వాహకులు మురళీ మోహన్ రాజు, డాక్టర్ రాధా కుసుమ, కె.వి కృష్ణకుమారి, మాగంటి ప్రసాద్ బాబు, రామచంద్ర గార్లచే అందుకున్నారు. కుసుమ ధర్మన్న కళా పీఠం, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్లు సంయుక్తంగా చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చింతల రాకేశ్ భవాని మాట్లాడుతూ ఈ పురస్కారం నకు ఎంపిక చేసిన సెలెక్షన్ కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాకేష్ భవాని ప్రతిష్టాత్మక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం 2024 ను అందుకున్నారు. తెలుగు భాషా సాహిత్యాలకు సంబంధించి వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని అనేక పత్ర సమర్పణలు చేశారు.”తెలుగు సినీ గేయ సాహిత్యం, సమకాలీన సమాజ చిత్రణ (1960-70)”అన్న అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి 2020లో డాక్టరేట్‌ను పొందారు.ప్రతిష్టాత్మక “తానా” వారి ఆధ్వర్యం లో 21 దేశాలు పాల్గొన్న “ ప్రపంచ మహా కవిసమ్మేళనం 21”లో భారతదేశం ప్రతినిధిగా నుండి నైజీరియా తెలుగు సంఘం తరపున పాల్గొని ప్రశంసలు పొందారు. తెలుగు భాషా చైతన్య సమితి, తెలంగా ణ రచయితల సంఘం లచే 2022 కాళోజీ విశిష్ట పురస్కారం ను, జాతీయ స్థాయిలో ఉత్తమ జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులకు అందజేసే ప్రతిష్టాత్మకమైన “ క్రిశా ఫౌండేషన్ “ ముంబాయి వారి 2022 “కరం వీర” పురస్కారం అందుకున్నారు. డా.బీ.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఇచ్చే “దళిత రత్న 2021” పురస్కారాన్ని సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ యోగితారానా, గోరేటి వెంకన్న లచే స్వీకరించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిస్టాన్ సంస్థ వారిచే తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి లచే “విద్యా సేవారత్న 2021” పురస్కారాన్ని. అంతర్జాతీయ సంస్థ హోలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ వారిచే డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎంపవర్మెంట్ పురస్కారం 2022 సంవత్సరానికి గాను ను విద్యారంగంలో చేసిన కృషికి గాను అందుకున్నారు. జాతీయ సేవాప థక రంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం అధికారిగా, కేంద్ర ప్రభుత్వం వారిచే కోవిడ్ సమయం లో జిల్లా నోడల్ అధికారిగా, నియమించబడి కోవిడ్ వారియర్ గా పనిచేసి, అధికారుల ప్రశంసలు పొందారు. రంగారెడ్డి జిల్లా నెహ్రూయువ కేంద్ర కమిటీలో సలహా సభ్యునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాకేశ్ భవానిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేశ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు స్టేటస్‌కో మధ్యే కబ్జా ఆరోపణ

### "మా స్థలాన్ని రక్షించండికోర్టు ఆదేశాలను నిలబెట్టండి" అని విజ్ఞప్తి



**అల్వాల్, నవంబర్ 29 (జనం సాక్షి):** కోర్టు జారీ చేసిన స్టేటస్‌కో ఉత్తర్వులు అమల్లో ఉన్నా తమ స్థలం మీద అక్రమంగా ప్రహరీ గోడలు వేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పాకలకుంట (అల్వాల్ మండలం) సర్వే నంబర్ 571లో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన బాధితులు జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులు, వెంకటేశ్వర్ కుటుంబ సభ్యులు, లలితా కుటుంబ సభ్యులు, శ్రీమన్నారాయణ, ప్రతాప్ తదితరులు వివరాలు వెల్లడించారు.

**కోర్టు ఆదేశాలు ఉన్నా పట్టించుకోకపోతున్నారనే ఆరోపణ :**

వారి వివరాల ప్రకారం మొత్తం 20 ఎకరాల భూమిలో 10 ఎకరాలు తమ తాతల నుండి వారసత్వంగా వచ్చాయని తెలిపారు. ఆ స్థలం కోర్టు వివాదంలో ఉండగా, డిసెంబర్ 2024లో కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేశాడని గుర్తుచేశారు. అయినప్పటికీ, కొందరు ఆక్రమణదారులు భూమిని కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. లయోలా అకాడమీ పేరిట బోర్డులు పెట్టి, బౌన్సర్లను మొహరించి ఎవరినీ లోనికి రానీయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.

**పోలీసులు, రెవెన్యూ, జిహెచ్ఎంసికి ఫిర్యాదులు స్పందన శూన్యం**

పోలీస్ స్టేషన్, మండల కార్యాలయం, జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాల్లో ఎన్నో ఫిర్యాదులు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద అన్ని ధ్రువపత్రాలు, రికార్డులు ఉన్నప్పటికీ కబ్జాదారులు దాదాపుగా నిర్మాణాలు పూర్తి దశకు తీసుకెళ్తున్నారని అన్నారు.

**'మా స్థలాన్ని రక్షించండి" : బాధితుల విజ్ఞప్తి**

ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకునేలా వెంటనే సంబంధిత శాఖలు జోక్యం చేసుకోవాలని, తమ స్థలాన్ని రక్షించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, జ్ఞానేశ్వర్, రుద్రమదేవి, వారాల చిత్ర తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ పరిపాలనకు నూతన స్ఫూర్తి



### ప్రజలకు చేరువైన కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పరిపాలనా వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తూ, ప్రజలకు నేరుగా చేరువైన అధికారిగా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారు. పదవిలోకి వచ్చిన మొదటి రోజునుంచే "పరిపాలన అంటే ప్రజలకే సేవ" అనే ధ్యేయంతో పనిచేస్తూ జిల్లాలో అన్ని రంగాల్లో కార్యకలాపాలకు కొత్త శక్తిని తీసుకువచ్చారు.

జిల్లా విస్తీర్ణం పెద్దది, సమస్యలు ఎన్నో అయినా, ప్రతి సమస్యను స్వయంగా ఫీల్డ్‌లోకి వెళ్లి పరిశీలించి, అధికారులు మరియు ప్రజల మధ్య సమన్వయాన్ని బలపరచడం మను చౌదరి పనిచేసే తీరు. ఈ ధోరణి వల్ల జిల్లాలోని రహదారులు, విద్య, ఆరోగ్యం, సంక్షేమం, శిశు సేవలు, దివ్యాంగ సంక్షేమం, వృద్ధుల రక్షణ వంటి రంగాల్లో స్పష్టమైన పురోగతి కనిపిస్తోంది.

ప్రజావాణిని పరిష్కార వేదికగా మార్చిన కలెక్టర్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం ఫిర్యాదుల స్వీకరణగా కాకుండా తక్షణ పరిష్కారాల వేదికగా తీర్చిదిద్దారు. ప్రజలు సమర్పించే వినతులను వెంటనే పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి పరిష్కారం దిశగా అడుగులు వేయడం ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది.



**విద్యా రంగంలో ప్రత్యేక శ్రద్ధ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను వరుసగా సందర్శిస్తూ విద్యార్థుల హాజరు, బోధనా విధానం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలను పరిశీలించారు. అవసరమైన చోట అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులు, తక్షణ పునరుద్ధరణ కోసం ఇంజనీరింగ్ విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**ఆరోగ్యరంగానికి నూతన దిశ :** మాతా-శిశు ఆరోగ్యం, మహమ్మారుల నియంత్రణ, కిషోర బాలికల ఆరోగ్య ప్రొఫైలింగ్, అత్యవసర సేవల బలోపేతం, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాల మెరుగుదలప్రతి అంశంపై కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లాలో ప్రసూతి సంరక్షణ కేంద్రాలు, నవజాత శిశు సంరక్షణ యూనిట్లు మరియు అత్యవసర వాహన సేవలు మరింత చురుకుదనాన్ని సంతరించుకున్నాయి.




**దివ్యాంగులు వృద్ధులకు చిత్తశుద్ధి సేవ :** జిల్లాలో దివ్యాంగులకు నిర్వహించే పోటీలు, అవగాహన కార్యక్రమాలు, వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన శిబిరాలకు స్వయంగా హాజరై వారికి ధైర్యం, భరోసా ఇవ్వడం మను చౌదరి ప్రత్యేకత. అంగవైకల్యం లేదా వయస్సు వల్ల ఎవరైనా ఇబ్బంది పడితే, ప్రభుత్వం వారి పక్కనే నిలుస్తుందని ఆయన ఇచ్చే హామీ ప్రజల్లో ఆదరణను పెంచుతోంది.

**ఎన్నికల విధులపై క్రమశిక్షణ :** ఓటర్ల జాబితా సవరణలో తప్పులు చోటుచేసుకోకుండా, ఇంటింటి ధృవీకరణను కచ్చితంగా నిర్వహించేందుకు ఈఆర్ఓలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చి ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను తీసుకువచ్చారు.

**పారిశ్రామిక వృద్ధికి ఊతం :** పరిశ్రమల అనుమతులు, పారిశ్రామిక మండలాల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహక చర్యలను వేగవంతం చేయడం ద్వారా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను పరిశ్రమలకు అగ్రగామిగా తీసుకెళ్లే దిశగా కలెక్టర్ కృషి చేస్తున్నారు.

**సామాన్య ప్రజల మాట వినే అధికారి :** పగలు-రాత్రి తేడా లేకుండా గ్రామాలు, పట్టణాలు సందర్శించడం, చిన్న సమస్యలనైనా అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించడం వల్ల మను చౌదరి ప్రజల్లో "మన కలెక్టరు"గా నిలిచారు. అధికార విలాసం కాదుప్రజల సేవే నిజమైన పరిపాలన అని ఆయన చూపించిన తీరు జిల్లావ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

**మేడ్చల్-మల్కాజిగిరికి దిశా నిర్దేశం :** స్పష్టమైన నాయకత్వం, పారదర్శక పరిపాలన, ప్రజలతో అనుబంధం మరియు సమస్యల పరిష్కారంలో వేగవంతతఈ నాలుగు లక్షణాలతో జిల్లా పరిపాలనకు మను చౌదరి తీసుకొచ్చిన మార్పు ప్రధాన పేజీకి తగిన ప్రజాకథనం అయింది.



# సాయిమల అయ్యప్పస్వామి దేవాలయంలో ఘనంగా 18వ మహా పడిపూజ

**కాప్రా, నవంబర్ 29, (జనంసాక్షి) :** కాప్రా డివిజన్ సాయిబాబా నగర్ లోని సాయిమల అయ్యప్పస్వామి దేవాలయంలో మాదిరెడ్డి హరినాథ్ రెడ్డి జనరల్ సెక్రెటరీ ఆధ్వర్యంలో శనివారం 18వ పడిపూజ ఘనంగా నిర్వహించారు.. ఉదయం గణపతి హెూమము అభిషేకములు పడిపూజ నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, హాజరై అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, సాయిమల అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ రేగళ్ల సతీష్ రెడ్డి, ట్రెజరర్ శేఖర్ చారి, జాయింట్ సెక్రెటరీ నిరంజన్ దాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పజ్జూరి పావని రెడ్డి, కృష్ణ యాదవ్, రామారావు, శ్రీహరి గౌడ్, యాదగిరి గౌడ్, కార్తీక్ గౌడ్, బాలకృష్ణారెడ్డి,జై మల్లారెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సంతోష్ రెడ్డి, నరసింహారెడ్డి, భూపాల్ రెడ్డి, చిన్నరెడ్డి , పోలీస్ కృష్ణారెడ్డి, పోలీస్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్ బాలాజీ ఆలయంలో వైభవమైన తిరుకల్యాణం

### ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు





**అల్వాల్, (జనంసాక్షి):** బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల భాగంగా శనివారం ఉదయం శ్రీ స్వామివారి తిరుకల్యాణోత్సవం భక్తుల మధ్య కన్నుల పండుగగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆచార్యులు తిరుకల్యాణ మహెూత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుకల్యాణం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక అనుభూతిని పొందారు. కార్యక్రమంలో వంశపారంపర్య చైర్మన్ రాజా సంజయ్ గోపాల్, కార్యనిర్వహణాధికారి మఠం వీరేశం, అర్చకులు రఘు, వంశీ, శ్రీనివాస్, రమణ పంతులు, పునరుద్ధరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలి



**మహేశ్వరం, (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ అన్నారు.శనివారం కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.అనంతరం దాసర్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా శ్యామరాజు కృష్ణను నియమించారు.ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ...రాబోయే సర్పంచ్ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరూ పని చేయాలన్నారు.గ్రామ శాఖ అధ్యక్షుడుగా పదవి బాధ్యతలు అప్పగించినందుకు కేఎల్ఆర్ కు శ్యామరాజు కృష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ డైరెక్టర్ యుగేందర్ గౌడ్,తాండ్ర బాలయ్య,పంగా రంగయ్య,ఎరుగమోని నర్సింహ, కొండం కృష్ణ,హోలీ,మిగిడి శేఖర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## అల్వాల్ పిఎచ్‌సీలో డీక్షా దివస్ సందర్భంగా పండ్ల పంపిణీ



**అల్వాల్, నవంబర్ 29 (జనం సాక్షి):** డీక్షా దివస్ సందర్భంగా అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేటర్ విజయశాంతి రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావుకు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డీక్షా దివస్‌లో భాగంగా ప్రజలకు సేవ చేయడం తమకు ఎల్లప్పుడూ ఆనందకరమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సబితా కిషోర్, సునీతా రాము యాదవ్ తదితర బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నార్సింగిలో ఘనంగా కేసీఆర్ దీక్షా దినోత్సవం



**రాజేంద్రనగర్, నవంబర్29(జనం సాక్షి) :** తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నార్సింగి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఘనంగా కార్యక్రమాలు నిర్వహించింది. నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నార్సింగి ప్రభుత్వ పాఠశాల దగ్గరలో జెండా ఎగురవేశారు. అనంతరం నాయకులు శంషాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి తరలి వెళ్లారు. రాజేంద్రనగర్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షుడు ముక్తారం, ప్రభాకర్, మల్లేష్, మహేష్, చిరంజీవి, యాదగిరి, నార్సింగి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ

### ఘనంగా సత్కరించిన ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతివీర్



**ఖైరతాబాద్, నవంబర్ 29 (జనం సాక్షి) :** నిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులు శనివారం పదవీ విరమణ చేసారు. పాత ఓపిడి భవనం మొదటి అంతస్తు లెర్నింగ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆసుపత్రి ఎగ్జిక్యూ టివ్ రిజిస్ట్రార్ శాంతివీర్ వారిని ఘనంగా సత్క రించి, వారు ఆసుపత్రికి అందించిన సేవల్ని కొని యాడారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో బర్తోలోమే(సీనియర్ నర్సింగ్ ఆఫీసర్), అరుణ కుమారి(నర్సింగ్ ఆఫీసర్) ఉన్నారు. ఈ కార్యక్ర మంలో మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, అసిస్టెంట్ రిజిస్ట్రర్స్, సుజాత, ఉమేష్, హెచ్.ఆర్.డి స్టాఫ్ ఏఎన్.జ్యోతి శైలజ, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు భరత్ భూషణ్, శాంతి, శుభదా, ఆశలత, సౌజన్య,కిజియా, ఉద్యోగులు, వారి బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని సత్కరించారు.

# పీర్జాదిగూడలో ఘనంగా దీక్షా దివాస్

### కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మాజీ మంత్రి మల్లారెడ్డి,మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన దీక్షా దివాస్ కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి,మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటించి అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడం కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29న తాను సచ్చైనా తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తానని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని తన చావును సైతం లెక్కచేయకుండా నీళ్లు,నిధులు, నియామకల కోసం తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడం కోసం ఆంధ్ర వలస వాదులపై అప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై విరామం ఎరగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహా యోధుడుగా పేరు పొందారన్నారు. నేటి తెలంగాణ రాష్ట్రంలో నీళు ,, నిధులు, నియామకాలు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి రాష్ట్రంలోని గోదావరి నది ప్రవాహాన్ని వొడిసిపట్టి కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులను నిర్మించి బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చిన ఘనత కేసిఆర్ కే దక్కిందని, మిషన్ కాకతీయ ద్వారా చెరువులను నింపి సస్యశ్యామలం చేసి పంటలకు అందించిన అపర భగీరథుడుగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని, గడిచిన10 ఏండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వలో అన్ని వర్గాలప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని మాజీ మంత్రి మల్లారెడ్డి కొనియాడారు. నాడు తెలంగాణ కోసం కేసీఆర్ స్ఫూర్తితో పీర్జాదిగూడలో అనేకమంది ఉద్యమంలో ఉవ్వెత్తున పాల్గొని అనేక కార్యక్రమాలను చేసి లాటి చార్జీలకు,కేసులకు భయపడకుండా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘు వర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొల్తూరు మహేష్, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,మైనారిటీ అధ్యక్షులు జిలాని పాష, జావిద్ ఖాన్, బాలరాజు,యాసరం శ్రీనివాస్,కిరణ్ గౌడ్,ప్రవీణ్ రెడ్డి,శ్రీనివాస్, జోగి రెడ్డి,శంకర్ గౌడ్,శ్రీరాములు గౌడ్,ప్రసాద్,మల్లం వెంకటేష్ గౌడ్, కూరెళ్ళ ఉపేందర్,రాధాకృష్ణన్ రావు,జగన్ రెడ్డి,నరేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,సతీష్ రెడ్డి, బుల్లెట్ శంకర్, శ్రీను, అశోక్ రెడ్డి,సోమేష్ గౌడ్, లింగారెడ్డి,అమర్ పటేల్, కృష్ణమూర్తి అంజయ్య నాగిరెడ్డి లక్ష్మీనారాయణ,శివరాజ్,అశోక్ రెడ్డి, సమ్మయ్య, కిరణ్ గౌడ్,ఉద్యమ గాయాలు మానని యోధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కళాకారులు,మహిళలు, యువతీయువకులు గొప్ప ఉత్సాహంతో పాల్గొన్నారు.



## దీక్ష దినోత్సవంలో బీఆర్ఎస్ నేతల ఐక్యత ప్రతిధ్వనించిన గండి మైసమ్మ సభ



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ గండి మైసమ్మ సమీపంలో ఉన్న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్ష దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది, కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నేతృత్వం వహించగా మాజీ మంత్రివర్యులు, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంలో శంభీపూర్ రాజుతో కలిసి నేతలు ప్రజా సంక్షేమం, ఉద్యమ స్ఫూర్తి, పార్టీ బలోపేతంపై చర్చించారు, కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రావు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్లు, మాజీ చైర్మన్లు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని దీక్ష దినోత్సవానికి తగిన గౌరవం అర్పించారు, బీఆర్ఎస్ ఉద్యమ పునాదులు, రాష్ట్ర సాధనలో పార్టీ పాత్రను గుర్తు చేస్తూ నాయకులు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

# హెచ్‌ఐవీపై సమగ్ర అవగాహన పెంచాలి

### జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవ అవగాహన కార్యక్రమం






**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నీలిమ వైద్య విజ్ఞాన సంస్థ, అనురాగ్ విశ్వవిద్యాలయం సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు, జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ అధికారి ఉమాగౌరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిబి, హెచ్ఐవీ-లెప్ కార్యక్రమాధికారి డాక్టర్ శ్రీదేవి జిల్లా పరిధిలో జరుగుతున్న చర్యలు, హెచ్ఐవీ స్థితిగతులు వివరించారు, కాలేజీ డీన్ డాక్టర్ లక్ష్మీప్రసన్న విద్యార్థులకు హెచ్ఐవీ-ఎయిడ్స్ పై అవగాహన కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు, ముఖ్య అతిథిగా మాట్లాడిన డీఎంహెచ్ఓ ఉమాగౌరి యువత ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకోవాలని హెచ్ఐవీపై సమగ్ర అవగాహనతోనే జిల్లా స్థాయిలో కొత్త కేసులను తగ్గించగలమని అన్నారు, ఫీల్డ్ సిబ్బంది, ఐసీటీసీ, స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం అన్నారు, అనంతరం పోస్టర్ తయారీ, వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులు, హెచ్ఐవీ సేవల్లో ప్రతిభ చూపిన ఐసీటీసీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలకు మెమెంటోలు, ధ్రువపత్రాలు అందజేశారు, చివరగా "ఎయిడ్స్ రహిత భారత్" ప్రతిజ్ఞతో పాటు ఐఈసీ ప్రదర్శన స్టాల్‌లను సందర్శించి కార్యక్రమాన్ని ముగించారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య అధికారులు డాక్టర్ సత్యవతి, డాక్టర్ లావణ్య, ఉప డెమో వసంతారెడ్డి, నారపల్లి వైద్యాధికారి డాక్టర్ శోభన, జిల్లా టీపీఎంసీ అధికారి సింహారాజు, వైద్య విద్యార్థులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, ఐసీటీసీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం





- **ఏకగ్రీవం అయినా గ్రామ పంచాయతీల అభివృద్ధికై రూ.10 నుండి20 లక్షలు**
- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు నవంబర్ 29(జనంసాక్షి) :** మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా శనివారం తాండూర్ మండలం మల్కపూర్ గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థిగా జనార్దన్ రెడ్డి, సంగెంకలాన్ గ్రామం నుండి భాగ్యలక్ష్మీ, కోత్లాపూర్ గ్రామం నుండి పట్లోళ్ళ లత నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులకు ప్రచార అస్త్రాలుగా నిలుస్తాయన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించడానికి సిద్దంగా ఉన్నారు. నియోజకవర్గంలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని వెల్లడించారు. ఇప్పటికే మెజార్టీ స్థనలు ఏకగ్రీవం అయ్యినట్టు సమాచారం ఉందన్నారు. ఏకగ్రీవం అయినా గ్రామ పంచాయతీల అభివృద్ధికై రూ. 10-20 లక్షలు అందిస్తామన్నారు. మెజార్టీ గ్రామాలలో ప్రతి పక్షాలకు అభ్యర్థులు లేక పోటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్యనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పదవులు ముఖ్యం కాదు ప్రజా సేవే లక్ష్యం

### పేదింటి మహిళకు పుస్తె మెట్టెల పంపిణీ
### హాజీపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్.



తాండూరు నవంబర్ 29(జనంసాక్షి) పదవిలో ఉన్నా లేకున్నా ప్రజాసేవ ముఖ్యంగా పనిచేస్తానని హాజీపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన కొండాయిపల్లి దేవమ్మ మనుమరాలు మనీలా వివాహానికి పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా హాజీపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్నా సరే ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతానని తెలిపారు. తన వంతు సహాయంగా హాజీపూర్ గ్రామంలో నిరుపేద మహిళా వివాహానికి పుస్తె మెట్టెలు అందజేస్తానని వెల్లడించారు. అదేవిధంగా గ్రామంలో పేదలకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటానని తెలిపారు. గ్రామ ప్రజలకు ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ గ్రామానికి చెందిన ప్రజలు తదితరులు ఉన్నారు.


## బీఆర్ఎస్ పార్టీలో చేరిన డివై నర్సింలు



**పెద్దేముల్ నవంబర్ 29(జనంసాక్షి) :** పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డివై నర్సింలు శనివారం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీని వీడిన డివై నర్సింలుకు గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తప్పుడు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చనందుకు గ్రామాల్లో ప్రజలు నిలదీస్తున్నారని వారికి ఏం చెప్పాలో తెలియక పార్టీని వీడుతున్నట్లు డివై నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, మండల పార్టీ అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, నరేష్ రెడ్డి, షిబ్లీ, రంగయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం

తాండూరు నవంబర్ 29(జనంసాక్షి)
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ కి గుణపాఠం చెప్పబోతున్నారని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల చివరి రోజైనా శనివారం తాండూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దేముల్ మండలం అడ్కిచర్ల, తట్టెపల్లి, పెద్దేముల్, ఇందూర్, యాలాల్ మండలం అగ్గనూర్, (దేవనూర్ గ్రామసర్పంచ్ అభ్యర్థిగా రేణుఖాదేవి) గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెజారిటీ స్థానాలు బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు గెలవబోతున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కోహర్ శ్రీనివాస్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లపై వరి ధాన్యం ఆరబెట్టిన రైతులకు దుద్యాల ఎస్సై శ్రీశైలం సూచనలు

### ప్రమాదాల నివారణకు రేడియం నియంత్రికల ఏర్పాటు

**జనం సాక్షి కథనానికి స్పందన**

**బొంరాస్ పేట, (జనం సాక్షి):** దుద్యాల మండల పరిధిలోని చిల్మూల్ మైలారం నుండి బాపల్లితండా వరకు వెళ్లే ప్రధాన రోడ్డుపై వరి ధాన్యము ఆరబెట్టిన రైతులు రాత్రిపూట నల్లటి కవర్లు కప్పడంతో ప్రమాదాలకు అవకాశం ఉందని ఇటీవల జనం సాక్షి కథనము ప్రచురించింది. స్పందించిన ఎస్సై శ్రీశైలం మండల పరిధిలోని వరి ధాన్యం రోడ్డుపై ఆరబెట్టిన ప్రాంతానికి వెళ్లి రేడియం నియంత్రికలను ఏర్పాటు చేశారు. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం వెంటనే తొలగించాలని రైతులకు సూచించారు.



# డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

### రూ.10వేలు అందించిన టిఎన్‌టియ సి యూనియన్ డ్రైవర్లు.

**తాండూరు నవంబర్ 29(జనంసాక్షి) :** గత నాలుగు రోజుల క్రితం మొయినాబాద్ దగ్గర రెండు కార్లు ఢీ కొన్న ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తోటి డ్రైవర్ గొట్టిగ కలాన్ వెంకటేష్ మృతి చెందిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వెంకటేష్ కుటుంబ సభ్యులకు తాండూరు టి ఎన్ టి యు సి యూనియన్ సభ్యులు శనివారం రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన నిరుపేద డ్రైవర్ గొట్టిగ వేంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి యూనియన్ నాయకులు శివరాజ్, వడ్డే రాజు, వెంకటేశం, అంబరీష్ సి. వెంకటేష్ పాల్గొన్నారు.

# సర్పంచ్ నామినేషన్‌కు ప్యానెల్ సిద్ధం

- **అంతలోనే ఎమ్మెల్యే ఫోన్.**
- **నీకు ఎంపీటీసీ పక్క.**
- **గందరగోళంలో వార్డు నెంబర్లు.**

**జిల్లేడు చౌదరిగూడ (జనంసాక్షి) :** కాంగ్రెస్ కార్యకర్తలకు ఊహించని షాక్ ఇచ్చారు నాయకులు. జిల్లేడు చౌదరి గూడ మండల పరిధి వీరన్న పేట గ్రామంలో ఓ వర్గం కాంగ్రెస్ నాయకుడు సర్పంచి బరిలో నిలిచేందుకు ప్యానెల్ సిద్ధం చేసుకున్నాడు అన్ని వార్డ్ నెంబర్లను తయారు చేసుకుని నామినేషన్ వేసేందుకు బయలుదేరుతున్న సమయంలో ఎమ్మెల్యే నుంచి ఫోను రాగా నీకే ఎంపీటీసీ పక్క అని చెప్పడంతో ఆ వ్యక్తి అవతల వ్యక్తికి బెండై హమ్మయ్య ఒక పోస్ట్ అయితే ఫిక్సయింది చాలు అని సైలెంట్ కావడంతో ప్యానల్ అంతా గందరగోళంలో పడి అక్కడున్న వార్డు నెంబర్లు యాదగిరి గౌడ్ పై ఫైర్ అయ్యారు వార్డ్ నెంబర్లను సెలెక్ట్ చేసి అంతా సిద్ధం అయ్యాక ఈ నిర్ణయం తీసుకోవడం ఏంటి అని ప్రశ్నించారు. వార్డు నెంబర్లకు యాదగిరి గౌడ్ తో పాటు నాయకులు అందరు మోసం చేశారని మండిపడ్డారు. నామినేషన్ కు రెడీ చేసిన పత్రాలను వార్డ్ నంబర్స్ చించేసి వెళ్లిపోయారు.

# పాసులున్న వారే గ్లోబల్ సమ్మిట్లో పాల్గొనాలి

### పోలీసులకు సహకరించాలి...
### మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్



**మహేశ్వరం,నవంబర్ 29(జనం సాక్షి) :** ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9న జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు పాసులు ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేఎల్ఆర్ అన్నారు. శనివారం కందుకూరు మండలం మీర్కాన్ పేట్ గ్రామ రెవిన్యూ పరిధిలో జరిగే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ...ప్రపంచ స్థాయి ప్రముఖులకు మూడంచెల భద్రతను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. విదేశాల నుంచి 1300 మంది, జాతీయస్థాయి ప్రముఖులు గ్లోబల్ సమ్మిట్ కు హాజరవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలను గ్లోబల్ సమ్మిట్ తర్వాత రాష్ట్ర అధినాయకత్వాన్ని కలిసేందుకు ఏర్పాట్లు చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి,పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్,మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.